# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్రమంత్రివర్గం సమావేశమైంది.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' అనే కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అధికారులు ప్రజలతో మమేకం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**3.** **రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు.**

**4.** **తెలంగాణ అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు భాగస్వామ్యాలు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.**

**5.** **ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష -టెట్‌కు 4 లక్షల 27 వేల 300 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది.**

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం ఢిల్లీలో నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో బంగ్లాదేశ్‌లో పరిస్థితిపై ప్రధానమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తదితరులు హాజరయ్యారు.మరోవైపు బంగ్లాదేశ్లో కొనసాగుతున్న ఆందోళనల వల్ల హింస చెలరేగడంతో ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచిపెట్టి వెళ్ళారని ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్-ఉజ్-జమాన్ ప్రకటించారు.తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేవరకు బంగ్లాదేశ్ ప్రజలు సహనంతో ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిన్న పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో 100 మంది మృతి చెందగా, 1000 మందికి పైగా గాయపడ్డారు.

-------------------------

ప్రతి నెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' అనే కార్యక్రమం కింద ప్రభుత్వ అధికారులు ప్రజలతో మమేకం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 15న 100 అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని మరో 83 క్యాంటీన్లు సెప్టెంబరు 23న అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు వనమహోత్సవం నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఒక రోజు ప్రత్యేకంగా లక్షల సంఖ్యలో మొక్కలు నాటాలని సూచించారు. రాష్ట్ర రహదారులు అన్నీ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో అభివృద్ధి చేయాలని, వీటికి అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తామని తెలిపారు. ప్రతి జిల్లాకు రెండో సంయుక్త కలెక్టర్‌ను కేటాయిస్తామని, మూడు నెలలకోసారి కలెక్టర్ల సదస్సు ఏర్పాటు చేసి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అమెరికాలోని ప్రవాస భారతీయులతో మంత్రి నిన్న దృశ్య మాధ్యమ విధానంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. రానున్న ఐదేళ్లకు సంబంధించి దేశంలో అత్యుత్తమ పారిశ్రామిక విధానాన్ని పెట్టుబడిదారుల కోసం త్వరలోనే తీసుకొస్తామని చెప్పారు. పెట్టుబడులతో పాటు స్థానికంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

---------------------------

తెలంగాణ అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాస భారతీయులు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా న్యూజెర్సీలో జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో పెట్టుబడులకు మెట్రో కోర్ అర్బన్‌తో పాటు, సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రపంచ స్థాయి ప్రణాళికతో హైదరాబాద్‌ను తీర్చిదిద్దనున్నామని అన్నారు. సాఫ్ట్ వేర్, ఔషధ, ఆరోగ్య, కృత్రిమ మేధ రంగాలకు తెలంగాణను కేంద్రంగా మారుస్తామని తెలిపారు.

ఇలా వుండగా యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయం చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రాను నియమిస్తున్నట్టు ఏ రేవంత్ రెడ్డి వెల్లడించారు. న్యూజెర్సీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ఆనంద్ మహీంద్రతో నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా ఉండాలని కోరామని ఇందుకు ఆయన అంగీకరించారని, రెండురోజుల్లో ఆనంద్ మహీంద్రా బాధ్యతలు స్వీకరిస్తారని ముఖ్యమంత్రి వివరించారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని తెలంగాణ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. ములుగు జిల్లాలోని అబ్బాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ .. మహిళా స్వయం సహాయక సంఘాలను కలుపుకొని అధికారులు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతిఒక్కరూ స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, మొక్కలు నాటాలని సూచించారు.

---------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి జూన్ 3వ తేదీ నాటికి తనకున్న భద్రతను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. వ్యక్తిగత భద్రతను తగ్గించారని గతంలో కేంద్రం తనకు జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు జగన్మోహన్ రెడ్డికి నిబంధనల మేరకు. జెడ్ ప్లస్ భద్రత కొనసాగుతుందని, ముఖ్యమంత్రి హోదాలో అదనంగా ఇచ్చే భద్రతను మాత్రమే తగ్గించామని.. ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ కు 4 లక్షల 27 వేల 300 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. ఈనెల 3వ తేదీతో దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియగా.. సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగంలో పేపర్ 1–ఎకు లక్షా 82 వేల 609మంది దరఖాస్తు చేసుకోగా.. సెకెండరీ గ్రేడ్‌టీచర్ ప్రత్యేక విద్య పేపర్ 1– బి కు 2 వేల 662 మంది చొప్పున దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. స్కూల్ అసిస్టెంట్ టీచర్ విభాగంలో పేపర్ 2–ఎ భాషలకు 64 వేల 36 మంది, గణితం విజ్ఞాన శాస్త్రానికి లక్షా 4 వేల 788 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు గతంలో నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే అక్టోబర్ 3 నుంచి 20 వరకు టెట్ పరీక్షలు పరీక్షలు నిర్వహిస్తామని.. అభ్యర్థులంతా సన్నద్ధం కావాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఓ ప్రకటనలో వెల్లడించారు. జులై 2న టెట్ నోటిఫికేషన్ ఇచ్చిన విద్యాశాఖ ఆగస్టు 3వరకు దరఖాస్తులు స్వీకరించింది.

---------------------------

తెలంగాణలో పరిశ్రమలు ఏర్పాటు చేసే యువ పారిశ్రామికవేత్తలకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలోని ఎండపల్లి పారిశ్రామిక వాడ నిర్మాణ పనులకు నిన్న ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 55 ఎకరాల్లో నిర్మించనున్న పారిశ్రామిక వాడకు 44 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. నిరుద్యోగ యువత పరిశ్రమల ఏర్పాటు చేసేందుకు వీలుగా విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. మధిర పారిశ్రామిక వాడను అనుసంధానించేందుకు రెండు వైపులా రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. తెలంగాణలో యువత పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే రుణాలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు.

---------------------------

తెలంగాణ వ్యాప్తంగా పాఠశాలల పరిశుభ్రత కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'కి పాఠశాలల పరిశుభ్రత బాధ్యతలను అప్పగించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రస్తుతం ఉన్న నిధులకు అదనంగా ఈ నిధులను కేటాయించినట్లు తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత పారిశుద్ధ్య పనుల కోసం ఈ నిధులను మంజూరు చేస్తూ, తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం.. 251 నుంచి 500 లోపు విద్యార్థులుంటే 12వేలు, 501 నుంచి 750 మంది ఉంటే 15వేలు, 750మంది కంటే అధికంగా ఉన్న పాఠశాలలకు 20వేల రూపాయల చొప్పున మొత్తం పది నెలల కాలానికి ఒకేసారి నిధులు విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ప్యారిస్‌లో ప్రస్తుతం జరుగుతున్న 33వ ఒలింపిక్ క్రీడలను పురస్కరించుకుని కేంద్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో కలిసి నాలుగు స్మారక తపాలా బిళ్ళలను నిన్న ఢిల్లీలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ మిశ్రమ బృంద పతక విజేత సరబ్ జ్యోత్ సింగ్, స్టీపుల్ ఛేజ్ అథ్లెట్ సుధాసింగ్, మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రాలు పాల్గొన్నారు. జావెలిన్ త్రో, ఫీల్డ్ హాకీ, సెయిలింగ్, టేబుల్ టెన్నిస్ లను ప్రతిబింబిస్తూ ఈ స్టాంపులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ దేశంలో ఖేలో ఇండియా వంటి పలు కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తోందని అన్నారు. ఇలా ఉండగా.. ఈ రోజు టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్, రెజ్లింగ్,హాకీ వంటి క్రీడా విభాగాల్లో భారత క్రీడాకారులు పాల్గొంటారు.

---------------------------

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి కేటాయింపులు చేయడం పట్ల రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు , రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్‌లతో కలిసి పురందేశ్వరి నిన్న ప్రధానమంత్రితో సమావేశం అయ్యారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్‌కి బడ్జెట్‌లో కేటాయింపులు చేసి, మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించామని, విశాఖ పట్నం ఉక్కు కర్మాగారంతో పాటు రాష్ట్రం ఎదుర్కొంటున్న వివిధసమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్ళామని పురందేశ్వరి తెలిపారు.

======================